క్లుప్తంగా

పుస్తకాల పంపిణీ



తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో రెఫిడెక్స్ ఆంగ్ల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ మాట్లాడుతూ సులభమైన పద్ధతులతో ఆంగ్లంలో విద్యార్థులు పట్టు సాధించేందుకు రిఫిడెక్స్ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. చదువుపై దృష్టి సారించి విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని ఆయన సూచించారు. దాతలు ఇచ్చే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు రాంచంద్రారెడ్డి, కిషన్‌రావు, ఉపాధ్యాయులు వెంకటయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



వెల్దండ: మండలంలోని కొట్రలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జంగయ్యయాదవ్ రూ.10వేలు, రమేష్‌గౌడు రూ.10వేలు, కృష్ణయ్యగౌడు రూ.10వేలు, మల్లయ్యగౌడు రూ.5వేల చొప్పున విరాళాలు ఇచ్చారు. అదేవిధంగా నారాయణపూర్‌తండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ రూ.50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త ఇంటిపై దాడి

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గుజ్జుల పరమేశ్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం అనంతరం కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ కార్యకర్త ఇంటిపై దాడి చేశారు. ఇంటి కిటికీలు ధ్వంసం చేశారు. ఇలాంటి దాడులు మంచిది కాదని బాధితుడు పేర్కొన్నాడు.

నాసిరకంగా బీటీ రోడ్డు



తెలకపల్లి: మండలంలోని బండపల్లి నుంచి గట్టురాయిపాకుల గ్రామానికి వేసిన బీటీ రోడ్డు నాసిరకంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. సీఆర్‌ఆర్ నిధులతో 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నాసిరకంగా నిర్మించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నామమాత్రంగా డస్టు వేసి చేతులు దులుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. నాసిరకంగా నిర్మిస్తే మళ్లీ కొన్ని రోజులకే రోడ్లు ధ్వంసం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును నాణ్యతగా వేసే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యనే విద్యుత్ లైన్



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో ఇళ్ల మధ్య విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సీసీ రోడ్డు మధ్య పైభాగంగా 11 కేవీ విద్యుత్ వైర్ లైన్ వెళ్లడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్ మార్చాలని ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు బిల్లుల వసూలుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపైన లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 11 కేవీలైన్‌ను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తెల్లబంగారం నల్లబారుతోంది..

- కూలీల కొరతతో పంట పొలాల్లోనే పత్తి
- ముసురు వర్షంతో ఆందోళన
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు



ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కూలీలు



తాడూరు శివారులో కిందికి జారిన పత్తి

తాడూరు: విత్తనం విత్తినప్పటి నుంచి పంట చేతికివచ్చే వరకు రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. భూమిని నమ్ముకుని పంటను సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పా.. లాభాలు రావడం లేదు. జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తుకున్న రైతులు అవి మొలకెత్తక నష్టపోయారు. పత్తి కాత, పూత దశకు చేరగానే అధిక వర్షాలతో మొక్కలు వడలిపోయాయి. ఫలితంగా ఆశించిన కాత రాలేదు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తున్న దశలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. పత్తి తీసేందుకు కూలీలు దొరకకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేలరాలితే నష్టాలే..

మండలంలోని 24 గ్రామాల్లో దాదాపు 22 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. పంటపొలాల్లో పత్తి పగిలి వారం రోజులు అవుతుంది. పగిలిన పత్తిని చూసి రైతులు మురిసి పోవాలా, పత్తి తీసేందుకు కూలీలు దొరకకపోవడంతో బాధపడాలా అనే దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సకాలంలో ఏరకుంటే పత్తి నేలరాలి నష్టపోయే అవకాశం ఉంది. దీనికి తోడు రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు కమ్మి ముసురు కారణంగా పత్తికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

పెరిగిన కూలి ధరలు..

మామూలుగా వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు రూ.200 నుంచి రూ.300 ఇస్తుంటారు. కానీ పత్తి తీసే విషయంలో కూలి రేట్లు వేరేలా ఉంటున్నాయి. గతేడాది కిలో పత్తి తీస్తే రూ.5 నుంచి రూ.6 చొప్పున ఇచ్చారు. ఈ ఏడాది కూలీల కొరత కారణంగా డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.350 నుంచి రూ.400 వరకు కూలి ఇస్తేనే కూలీలు దొరుకుతున్నారు. ఇతర గ్రామాల నుంచి ఆటోల ద్వార తరలించడంతో అదనంగా ఆటోల కిరాయి కూడా రైతులే భరించాల్సి వస్తుంది.

కూలీల కొరత..

చేతికొచ్చిన పత్తిని ఇంటికి తెచ్చుకునేందుకు కూలీల కొరత కారణంగా రైతులే రోజుల తరబడి పత్తి తీసుకుంటున్నారు. కూలి ధరలు ఎక్కువగా ఉండడంతో కూలీలు దొరకక రైతులు వారే సొంతంగా పత్తి తీసుకుంటున్నారు.

– బాలస్వామి, రైతు, పర్వతాయిపల్లి

'ఉపాధి'ని అనుసంధానం చేయాలి

ఉపాధి కూలీల ద్వార రైతు పంటపొలాల్లో పత్తితీత చేపడితే అటు కూలీలకు మంచి కూలి అందడమే కాకుండా రైతులకు సైతం ఉచితంగా పత్తి ఇంటికి చేరుతుంది. దీంతో సాగు నష్టాలను పూడ్చి కొంత వరకైనా సాగులో నిలదొక్కుకోవచ్చు.

– వెంకటయ్య, రైతు, ఆకునెల్లికుదురు

ముసురుతో రైతన్న ఆందోళన



మేడిపూర్ దగ్గర ధాన్యంపై కవర్లు



జంగంరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరిపైరు

అమ్రాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో ముసురు పట్టింది. దీంతో వరిరైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలో మొత్తం 200 ఎకరాల్లో బోర్ల కింద రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పంటలు కోత దశలోఉన్నాయి. ముసురు కారణంగా వరిపైరు నేలవాలింది. దీంతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

కల్లాల్లోనే వరిధాన్యం

తాడూరు: ఇటీవల వరికోత చేసిన రైతులు ముసురు వర్షం కారణంగా వరిధాన్యాన్ని కల్లాల్లోనే భద్రపరిచారు. సోమవారం ముసురు వర్షం రావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం 25 ఏళ్లుగా కృషి చేస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులు రాజేందర్, మోపతయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, మల్లికార్జున్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు అచ్చంపేట అసెంబ్లీ అభ్యర్థి గెలుపు ఒక సెంటిమెంట్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వరుసగా మూడు పర్యాయాలు ఓటమి పాలైనా ఆయన పార్టీని వీడలేదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపారని, అచ్చంపేటలో 50 వేల ఓట్ల పైచిలుకు భారీ మెజార్టీ సాధించారన్నారు.

నల్లమల ప్రజల విజయం

నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలలుగా కార్యకర్తలు అహర్నిశలు తన గెలుపుకోసం కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు.

నిరుపయోగంగా భవనాలు



కల్వకోల్‌లో నిరుపయోగంగా ఉన్న మీసేవ, గ్రంథాలయ భవనం

పెద్దకొత్తపల్లి: మండలంలని కల్వకోల్‌లో రూర్బన్ మిషన్‌లో భాగంగా ఏడాది కిందట మీసేవా కేంద్రం, గ్రంథాలయ భవన కేంద్రం నిర్మించారు. రూ.7.50 లక్షలు నిధులు వెచ్చిం మీసేవా కేంద్ర భవనం, రూ.2లక్షలు గ్రంథాలయ భవనం నిర్మించి వృథాగా వదిలేశారు. కొత్త భవనాలలో నిర్మించారు కాని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.లక్షలతో భవనాలు నిర్మించి ప్రజాధనం వృథా అయ్యాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నిర్మించిన భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



చారకొండ: మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయం, జూపల్లిలో రైతువేదిక కార్యాలయంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్య మాట్లాడుతూ రైతులు వరి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. మద్దతు ధర 1010 రకం రూ. 2023 కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



మేడిపూర్, గుంతకోడూరు మధ్య కొనసాగుతున్న పనులు

తాడూరు: మండల కేంద్రం నుంచి మేడిపూర్, గుంతకోడూరు గ్రామాల మీదుగా నాలుగు లేన్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గగ్గలపల్లి, కొల్లాపూర్ చౌరస్తా నుంచి పెద్దకొత్తపల్లి మీదుగా కొల్లాపూర్‌తో పాటు కర్నూల్ జిల్లా నంద్యాల మీదుగా తిరుపతి వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు కోసం భూసేకరణ పూర్తయిందని వివరించారు.

మండలంలో పట్టుబిగించిన కాంగ్రెస్

కల్వకుర్తిరూరల్: మండలంలోని మెజారిటీ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ పట్టుబిగించింది. గ్రామాల్లో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పోలయ్యాయి. బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. బీఆర్‌ఎస్ మూడో స్థానానికే పరిమితమైంది. మెజారిటీ గ్రామాలలో అధికార పార్టీ సర్పంచ్‌లు, నాయకులు ఉన్నప్పటికి ఆ పార్టీ మూడవ స్థానానికి పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని యంగంపల్లి, జీడిపల్లి, తోటపల్లి, వేపూరు, జంగారెడ్డిపల్లి గ్రామాలలో మాత్రమే బీఆర్‌ఎస్ రెండో స్థానంలో నిలిచింది. మిగతా అన్ని గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థి మొదటి స్థానం, బీజేపీ అభ్యర్థి రెండోస్థానంలో నిలిచారు. కల్వకుర్తి మండలంపై కాంగ్రెస్ పట్టుబిగించడంతో అభ్యర్థి విజయం సులువైంది. మండలంలో కాంగ్రెస్ పార్టీకి 11851 ఓట్లు రాగా, బీజేపీకి 8257, బీఆర్‌ఎస్‌కు 4655 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య దాదాపు 6వేల ఓట్ల వ్యత్యాసం ఉంది. కల్వకుర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ పట్టుబిగించడంపై ఆ పార్టీ నాయకులు సంబరాల్లో మునిగిపోయారు. మేజర్ గ్రామపంచాయితీలలో బీజేపీ సత్తాచాటింది. తర్నికల్, గుండూరు, ముకురాల గ్రామంలో ఆ పార్టీ మొదటి స్థానంలో ఓట్లు పోలయ్యాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ మెజారిటీ ఓట్లు దక్కాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు



అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలుపొందడంతో అచ్చంపేట ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు మోహన్‌లాల్, వెంకటయ్య, ఏకేగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ..



కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం రాత్రి క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి డబ్బు కొడుతూ ఆవరణతో నృత్యాలు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హోదాలో రాజేష్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి రానున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

దాండియా ఆడిన మహిళలు



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ఘన విజయం సాధించడంతో మండలంలోని తాండ్రలో సోమవారం ఆ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో దాండియా, కోలాటాలతో మహిళలు ఆడుతూ సందడి చేశారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు.

బీజేపీ నాయకుల సంబురాలు



నాగర్‌కర్నూల్‌లో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



కొల్లాపూర్‌లో

కందనూలు: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయ దుందుభీ మోగించడంపై సోమవారం స్థానిక బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక బీజేపీ ఎంపీలు గెలిచేందుకు ఈ ఎన్నికలు ఆత్మవిశ్వాసాన్ని నింపాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు ముందు సెమీఫైనల్స్‌గా భావించే ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడంతో పాటు, తెలంగాణలో 8 స్థానాల్లో గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపునకు ఈ ఎన్నికలే నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలుచేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కద్దాల కృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, నాయకులు కాశీపురం మహేష్, ఎల్లయ్య, మెంటె శివకృష్ణ, చరణ్, కురుమయ్య, జగపతిరావ్, పరమేష్, చంద్రశేఖర్‌రావు, బొమ్మరిల్లు భాస్కర్ తదితరులున్నారు.

కవర్లలో సారవంతమైన మట్టి నింపాలి



పాన్‌గల్: మొక్కల పెంపకానికి కవర్లలో నింపే మట్టిని సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి కవర్లలో నింపే మట్టిని, కవర్లను పరిశీలించారు. కవర్లలో నింపే మట్టిని జల్లెడ పట్టి నింపాలన్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలకు పాదులు తీసి క్రమం తప్పకుండా నీటిని పట్టాలని సూచించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య 50కి తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

చల్లబడిన వాతావరణం

కొల్లాపూర్: అల్పపీడనం ప్రభావం కారణంగా పట్టణంలో సోమవారం రోజంతా చల్లటి గాలులు వీచాయి. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండటంతో చాలామంది ఇంటికే పరిమితం అయ్యారు. పనులను వాయిదా వేసుకున్నారు. రోడ్లపై వాహనదారులు పలుచగా కనిపించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరికోతలు ఉంటే నిలిపివేయాలని, ఇతర పంటలను సాగుచేస్తున్న వారు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సూచించారు.

ప్రత్యేక కార్తీక పూజలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని పద్మశాలి మహిళాసంఘం ఆధ్వర్యంలో కార్తీక సోమవారం సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ముఖ్య అతిథిగా అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, కౌన్సిలర్ సునీతారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అటవీశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద వనభోజనాలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ అఖండ మెజారిటీతో గెలుపొందడంతో పద్మశాలి మహిళాసంఘం ఆధ్వర్యంలో అనురాధను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కర్నాటి నిర్మల, పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్, శ్రావణి, సరిత, హైమావతి, నిర్మల, గీత, శకుంతల, కల్యాణి, కృష్ణవేణి, తిర్పతమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తలకు తెలుపుతూ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అమ్రాబాద్: మండల కేంద్రంలో కింది బస్టాండ్ పక్కన మద్దిమడుగు రహదారి దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడే మూలమలుపు ఉండటంతో వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

పెన్నుల పంపిణీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక, ఎస్సీ కాలనీ ప్రాథమిక, బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు వారి సతీమణి ఇందిరమ్మ అందజేశారు. ఆయా పాఠశాలల్లోని మొత్తం 500 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. పేద విద్యార్థులకు తమ వంతుగా ప్రతి సంవత్సరం తోడ్పాటునందిస్తామన్నారు.



పట్టణంలో హస్తం హవా

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణ ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణకు 1,15,337 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుకు 66,011 ఓట్లు పోలయ్యాయి. పట్టణంలోని 20 వార్డుల్లో మొత్తం 22,537 ఓటర్లు ఉండగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 13,247 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణకు 8,935 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వలబాలరాజుకు 3,940, బీజేపీ అభ్యర్థి సతీస్‌మాదిగకు 456 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 2,065 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో 4,995 పోలయ్యాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి పట్టణ ఓటర్లు వైఖరిలో పూర్తి మార్పు కనిపించింది. పోలింగ్ కేంద్రం 101లో ఈవీఎం ఓపెన్ కాకపోవడంతో ఓట్లను లెక్కించలేదు.

మండలంలో కాంగ్రెస్‌కు 11,525 ఓట్లు ఆధిక్యం

ఎన్నికల్లో అచ్చంపేట మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకష్ణకు బీఆర్‌ఎస్ సమీప ప్రత్యర్థి గువ్వల బాల్‌రాజుకు కంటే 11,525 ఓట్లు అధికంగా వచ్చారు. కాంగ్రెస్‌కు పట్టణంలో 4,995 ఓట్లు, గ్రామీణంలో 6,530 ఓట్ల మోజార్టీ లభించింది. 2018లో బీఆర్‌ఎస్‌కు అచ్చంపేట మండలంలో 1,240 ఓట్లు ఎక్కువ వచ్చాయి. మండలంలో గ్రామీణంలో మొత్తం 35,248 ఓటర్లు ఉండగా 30,802 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్ అభ్యర్థికి 17,548, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 11,018 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 544 ఓట్లు పోలయ్యాయి.

మున్సిపాలిటీలో వివిధ వార్డుల వారీగా పోలైన ఓట్లు

వార్డు	పోలింగ్ కేంద్రం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	ఆధిక్యం
1	88	223	557	334
2	89	361	622	261
3	90	171	366	195
4	91	161	509	348
5	92	168	499	331
6	93	251	549	298
7	94	248	507	259
8	95	320	612	292
9	96	111	342	231
10	97	180	449	269
11	98	176	348	172
12	99	161	510	349
13	100	309	548	239
15	102	136	374	238
16	103	167	412	245
17	104	103	301	198
18	105	188	445	257
19	106	263	552	289
20	107	243	433	190
మొత్తం		3,940	8,935	4,995